అవే సమస్యలు..

పరిష్కారానికి వేడుకోలు!



వృద్ధురాలి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: పదుల సంఖ్యలో అర్జీలు ఇచ్చినా సంబంధిత అధికారుల నుంచి స్పందన కరవైందని, దశాబ్ద కాలంగా గోడు వెల్లబోసుకుంటున్నా తమ గోసలు తీర్చ లేకపోతున్నారని, ప్రభుత్వ భూమిని కొందరు అక్రమార్కులు కబ్జాకు పాల్పడుతున్నారంటూ ఇలాంటి అనేక సమస్యలు ప్రజావాణిలో వెల్లువెత్తాయి. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, జనగామ ఆర్డీవో కొమురయ్య ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయా దరఖాస్తులను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మొత్తం 44 దరఖాస్తులు రాగా ఎక్కువగా రెవెన్యూ సమస్యలు ఉండడం గమనార్హం.

సాగుభూమిలో నీలగిరి చెట్లను తొలగించాలని..



బచ్చన్నపేట మండలంలోని కొన్నె, రామచంద్రగూడెంలోని వ్యవసాయ భూముల్లో పెంచుతున్న నీలగిరి చెట్లను తొలగించాలని కోరుతూ కొన్నెకు చెందిన బాలమల్లు కలెక్టర్‌కు విన్నవించారు. గత పదేళ్లుగా కొందరు 60 ఎకరాల్లో నీలగిరి(జామైల్) చెట్లను ఇప్పటి వరకు మూడుసార్లు పెంచి కటింగ్ చేసి లాభాలు గడించారని, దాని వల్ల బోరుబావులు ఎండిపోయాయని పేర్కొన్నారు. తగు చర్యలు తీసుకొని మిగతా రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలని కోరారు.

ఫిర్యాదు చేసినా పట్టింపే లేదు..



జనగామ మండలం వెంకిర్యాలకు చెందిన ఈయన పేరు కందుల ప్రభాకర్. వీరి పొలం వద్దకు వెళ్లేందుకు 3 ఫీట్ల వెడల్పుతో నక్షా బాట ఉన్నట్లు తహసీల్దార్ సర్వే చేసి నివేదిక ఇచ్చారు. ఉపాధి పనుల్లో భాగంగా రోడ్డు పనులు చేపట్టగా, కొందరు ధ్వంసం చేశారని, వారిపై కేసు రిజిస్టర్ చేసి తహసీల్దార్ వద్ద నిందితులను బైండోవర్ చేసి నక్షా బాటను అక్రమదారుల నుంచి కాపాడాలని కోరారు. ఈ సమస్యపై మండల, జిల్లా కార్యాలయాల్లో 15 సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ మరోమారు కలెక్టర్‌కు విన్నవించారు.

శాఖల వారీగా దరఖాస్తులు..
తహసీల్దార్ పరిధిలోనివి : 16
ఆర్డీవో.. : 6 డీపీవో : 4
ఇతర : 18

ప్రభుత్వ భూమిని కాపాడండి..



వీరంతా బచ్చన్నపేట మండలంలోని సాల్వాపూర్ గ్రామస్థులు. గ్రామ శివారులోని సర్వే నెం.147లో 165 ఎకరాల్లో 29 ఎకరాల భూమి ప్రభుత్వ స్థలంగా రికార్డయింది. మిగతా భూమిని గ్రామ బడుగు బలహీన వర్గాలకు చెందిన వారికి ప్రభుత్వం పట్టాలిచ్చింది. అయితే 29 ఎకరాల భూమిని కొందరు రియల్టర్లు ఆక్రమించుకొని, ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. ఆక్రమణదారులపై తగు చర్యలు తీసుకొని, హద్దులు ఏర్పాటు చేసి, పక్కన రైతులకు ఇప్పించాలని కోరారు.

మరికొన్ని అర్జీలు ఇలా..

కొడకండ్ల మండలం రామన్నగూడెంలోని సర్వే నెంబర్ 703లోని బంజారకుంట కట్టపై నిర్మించిన ఆలయాన్ని తొలగించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన రవి, పాండు, శంకర్ ఫిర్యాదు చేశారు. ● స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని తాటికొండకు చెందిన ఎ.రాజమ్మ సర్వే నెంబర్ 132లోని ఎకరం భూమిని వేరే వ్యక్తి ఆక్రమించుకున్నాడని అర్జీ అందజేశారు. ● జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్‌కు చెందిన బైరగోని కళావతి పంచాయతీ కార్యదర్శిపై తాను పెట్టిన కేసును విచారణ జరపకుండా జాప్యం చేస్తున్నారని, ఇలా పలువురు తమ గోడును కలెక్టర్ ముందు వెల్లబోసుకున్నారు.

రైతేరాజు
నెట్టింట్లో.. అమ్మేస్తున్నారు!
వివరాలు 8లో..

క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పూజలు



భర్త రాజా రాంమోహన్‌రెడ్డితో కలిసి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వ అధికారిక పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సోమవారం స్థానిక శాసనసభ్యురాలు మామిడాల యశస్వినిరెడ్డి ప్రారంభించారు. తొలుత ఆమె భర్త రాంమోహన్‌రెడ్డితో పాటు కుమార్తెతో కలిసి హోమం నిర్వహించారు. ప్రారంభోత్సవ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇకపై తమ నివాసాన్ని పాలకుర్తికి మార్చామని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మహాన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ బ్లాక్ అధ్యక్షుడు సత్యనారాయణ, మండలాధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవీ.. ఛార్జింగ్ కేంద్రాలేవీ?

ప్రయివేటు కంపెనీలు ఏర్పాటుచేసిన రెండు మూడు చిన్న ఛార్జింగ్ పాయింట్లు, అదీ వరంగల్ ప్రాంతంలో మాత్రమే ఉన్నాయి.

● ఓరుగల్లులో పెరుగుతున్న విద్యుత్తు వాహనాలు


'మూడేళ్ల కిందట తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల సంస్థ (టీజీ రెడ్కో) నగరంలో పది ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు సర్వే చేపట్టింది. విద్యుత్తు సబ్‌స్టేషన్ల పరిధిలో ఏర్పాటుచేస్తామని ప్రకటించింది. ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి.'



ఈనాడు, వరంగల్, రంగశాయిపేట, న్యూస్‌టుడే

రోజురోజుకు పెరిగిపోతున్న పర్యావరణ కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు, ఆకాశాన్నంటుతున్న ఇంధన ధరల భారం తగ్గించేందుకు ప్రభుత్వాలు విద్యుత్తు వాహనాలను (ఈవీ) ప్రోత్సహిస్తున్నాయి. ఈ క్రమంలో రాజధాని హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరమైన వరంగల్‌లో ఈ వాహనాలను విక్రయించే షోరూంల సంఖ్య పెరుగుతోంది. ఈ- కార్లు, విద్యుత్తు ఆటోలు, ఇతర పెద్ద ఎలక్ట్రిక్ వాహనాల కోసం నగరంలో సరిపడా ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడం పెద్ద లోటు. హైదరాబాద్ పరిధిలో ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసిన రెడ్కో ఓరుగల్లులో పెట్టకపోవడంతో సుదూరాల నుంచి నగరానికి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.

నిట్ సాంకేతిక అండ



ఈవీ ఛార్జింగ్ స్టేషన్లపై నిట్ రూపొందించిన ప్రాజెక్టు

నగరంలో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు వరంగల్ జాతీయ సాంకేతిక సంస్థ పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంది. రెండేళ్ల కిందట 'ఆప్టిమల్ లొకేషన్ ఆఫ్ ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్స్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్స్ ఇన్ వరంగల్' అనే పేరుతో ప్రాజెక్టు చేపట్టింది. నిట్‌లోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ పెర్లి సురేశ్‌బాబు నేతృత్వంలో దీన్ని పూర్తి చేశారు. నగరంలో వాహనాల రద్దీ దృష్ట్యా ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు ఎక్కడెక్కడ వస్తే బాగుంటుంది.. సబ్‌స్టేషన్ల నుంచి ఏ మేరకు విద్యుత్తు అవసరం ఉంటుందని లోతుగా అధ్యయనం చేసి పరిశోధన పత్రం రాస్తే అది స్విట్జర్లాండ్ జర్నల్‌లో ప్రచురితమైంది. నగరంలో 39 కేంద్రాలు ఏర్పాటుచేయాలని ఆ ప్రాజెక్టు ద్వారా గుర్తించారు.


స్టేషన్ల ఏర్పాటు ఎంతో అవసరం



వరంగల్‌లో ప్రయివేటు ఎలక్ట్రిక్ ఛార్జింగ్ పాయింట్

వాహనాల్లో పెట్రోలు, డీజిల్ వేయించుకోవడం సులువు. రెండు మూడు నిమిషాల్లో పూర్తవుతుంది. అదే విద్యుత్తు ఛార్జింగ్‌కు చాలా సమయం పడుతుంది. గంటల తరబడి వేచి చూడాల్సి ఉంటుంది. ఈ క్రమంలో స్టేషన్లు ఉంటే కూర్చునేందుకు కుర్చీలు, మంచినీటి సౌకర్యం ఉంటాయి. వీటిని ప్రభుత్వం ఏర్పాటుచేస్తే విద్యుత్తు ధరలు కూడా తక్కువగా ఉంటాయి.

● నగర వాసులు డీజిల్, పెట్రోల్ నుంచి ఎల్‌పీజీ, సీఎన్‌జీకి.. ఇప్పుడు క్రమంగా ఈవీలపై ఆసక్తి చూపుతున్నారు. 2022లో హనుమకొండ జిల్లాలో ఎలక్ట్రానిక్ ద్విచక్ర వాహనాలు 375 రిజిస్ట్రేషన్ కాగా.. గతేడాది 736, ఈ ఏడాది ఇప్పటికే 950 దాటిపోయాయి. కార్ల కొనుగోలుపై నగర వాసులు ఆసక్తి చూపుతున్నారు. రెండేళ్ల కిందట 15 ఉండగా, గతేడాది 67కు చేరాయి. ఈ ఏడాది ఇప్పటికే 36 దాటిపోయాయి. డిసెంబరుకల్లా వందకు చేరే అవకాశం ఉంది.



కార్లకు కష్టమే - శ్రీకాంత్, హనుమకొండ



నాకు ద్విచక్ర విద్యుత్తు వాహనం ఉంది. ఇంట్లోనే ఛార్జింగ్ పెట్టుకుంటాను. మా స్నేహితులు హైదరాబాద్ నుంచి హనుమకొండకు వచ్చినప్పుడు అదనపు బ్యాటరీలు తెచ్చుకుంటున్నారు. లేదా మా ఇంట్లో ఛార్జింగ్ పెట్టడం వల్ల గంటల తరబడి సమయం వృథా అవుతోంది. ఛార్జింగ్ స్టేషన్ ఉంటే కొద్ది సమయం సరిపోతుంది. ఓరుగల్లు నగరంలో ప్రభుత్వం ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయాలి.



విద్యుత్తు ద్విచక్రవాహనం



ఈవీ ఆటో

ఆర్టీసీ కూడా మరిచింది

వరంగల్ రీజియన్ ఆర్టీసీ బస్సుల్లో కొన్ని ఈవీలను వినియోగిస్తామని మూడేళ్ల కిందట ప్రకటించారు. ఇప్పటికే హైదరాబాద్‌లో ఆర్టీసీ అనేక ఈ బస్సులను తీసుకొచ్చింది. అదే స్ఫూర్తితో మొదటి దఫాలో ఓరుగల్లు నగరంలో 10 విద్యుత్తు బస్సులు తెస్తామని ప్రకటించి.. అంతటితో ఆ ప్రతిపాదన అటకెక్కించింది.

దిల్లీ విధానం భేష్



కేంద్ర ప్రభుత్వం 2030 కల్లా దేశంలో సగానికి సగం విద్యుత్తు వాహనాలనే రహదారులపై తీసుకురావాలనుకుంటోంది. ఈ క్రమంలో దిల్లీ ప్రభుత్వం అక్కడి వాయు కాలుష్యం దృష్ట్యా ఈవీలను బాగా ప్రోత్సహిస్తోంది. 'స్విచ్ దిల్లీ' పేరుతో పాలసీ రూపొందించింది. 30 వేల ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేస్తోంది. ఇప్పటికే 2,452 ఏర్పాటు చేసింది. ఛార్జింగ్ స్టేషన్లు 1,919 ఉన్నాయి.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



స్టేషన్‌ఘన్‌పూర్ జలాశయంలో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే కడియం, ఎంపీ కావ్య

చిల్పూర్, న్యూస్‌టుడే: మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ప్రభుత్వం అందించిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో ప్రారంభించి ఎంపీ కడియం కావ్యతో కలిసి జలాశయంలో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు డివిజన్ కేంద్రంలో దేవాదుల ప్రాజెక్టుకు రూపకల్పన చేసి జలాశయం నిర్మించడంతో నేడు అనేక మంది రైతులకు సాగునీరు, తాగునీరు అందుతోందని వివరించారు. నియోజకవర్గంలోని జలాశయాల ద్వారా వేల మంది ముదిరాజ్‌లకు ఉపాధి లభించడం సంతోషంగా ఉందన్నారు. అక్టోబర్ మాసంలో చేప పిల్లలను చెరువుల్లో వదిలితే ఉపయోగం ఉండదని, జులై చివరి లేదా ఆగస్టు మొదటి వారంలో వదిలితే అవి బరువు పెరిగి ముదిరాజ్‌లకు లాభం జరుగుతుందన్నారు. ఇలా అక్టోబర్‌లో పోస్తే అనుకున్న స్థాయిలో లాభం ఉండదని సూచించారు. డివిజన్ కేంద్రానికి మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు చేపల మార్కెట్.. మహిళలకు కమ్యూనిటీ భవనం అందిస్తామని వెల్లడించారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. పదేళ్లలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం ప్రజలు ఊహించినంత అభివృద్ధి జరగలేదన్నారు. గత పాలకులు నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. గతంలో మొద్దు నిద్రలో ఉండి తినడానికి, తాగడానికి నిద్రలేచిన గత పాలకులు ఇప్పుడు ఉప ఎన్నికలు వస్తాయని పగటి కలలు కంటున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా కడియం శ్రీహరి ఎమ్మెల్యే, మంత్రిగా ఉండి చేసిన అభివృద్ధే కనిపిస్తోందని, ప్రజలు ధైర్యంగా ఉండాలని 20 ఏళ్ల తరువాత ఘన్‌పూర్ ఎలా ఉంటుందో అలా అభివృద్ధి చేసుకుందామన్నారు. ఎంపీగా తన నిధులను ఎక్కువగా ఘన్‌పూర్ నియోజకవర్గానికే ఖర్చు చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, ఏసీపీ భీమ్‌శర్మ, డీఎఫ్‌ఓ రణప్రతాప్, మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షుడు నీల రాజు, సొసైటీ అధ్యక్షుడు మునిగెల వెంకటేశ్వర్లు, నీల గట్టయ్య, బూర్ల శంకర్, ఐలయ్య, శ్రీధర్, రాజు, మహేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను ప్రశ్నించిన నాయకుడు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని దేవాదుల జలాశయం కట్ట వద్ద ఏర్పాటు చేసిన చేప పిల్లల పంపిణీ కార్యక్రమ వేదికపైకి తనను ఎందుకు పిలవలేదని మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నీల శ్రీధర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ప్రశ్నించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం ఎమ్మెల్యే వెళ్తుండగా శ్రీధర్ తనను వేదికపైకి పిలవలేదని, తనకు ఇచ్చే గౌరవం ఇదేనా అని అడిగారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. చేప పిల్లల పంపిణీ పార్టీ కార్యక్రమం కాదని పార్టీ మండలాధ్యక్షుడిని సైతం వేదికపైకి పిలవలేదని సమాధానం ఇచ్చారు. నాయకులు శ్రీధర్‌కు నచ్చ చెప్పడంతో గొడవ సద్దుమనిగింది.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా, చిత్రంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, తదితరులు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: ఈ నెల మూడో వారంలో జిల్లాలోని 20 గ్రామాల సందర్శనకు జాతీయ బృందం రానున్నందున సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణాభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించనుందని, అందుకు సంబంధించిన పింఛన్, ఉపాధి హామీ పనులను పూర్తి చేయాలని, రికార్డులు, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని డీపీవో, డీఆర్డీవో అధికారులకు సూచించారు. అదేవిధంగా ఈ నెల 9న హైదరాబాద్‌లో జరిగే డీఎస్సీ అభ్యర్థుల నియామకపత్రాల అందజేత కార్యక్రమానికి జిల్లా నుంచి 220 మంది అభ్యర్థులు వెళ్లనున్నారని అందుకు అవసరమగు అన్నీ ఏర్పాట్లు చేయాలని డీఈవో, డీఏవో, పోలీసు, డీసీఎస్‌వో, డీఎంసీఎస్, డీఎంహెచ్‌వోలను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ సుహాసిని, జనగామ ఆర్డీవో కొమురయ్య, జడ్పీ సీఈవో సరిత, డీఆర్డీవో వసంత, డీఈవో రాము, డీపీవో స్వరూప, డీఏవో రామారావునాయక్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బృందం పర్యటనపై సన్నాహక సమావేశం..

జనగామ రూరల్, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పూర్తి చేసిన పనులను పర్యవేక్షించేందకు త్వరలోనే ఎన్‌ఎల్‌ఎం (నేషనల్ లెవల్ మానిటరింగ్) బృందం పర్యటించనుందని అదనపు డీఆర్డీవో చంద్రశేఖర్ వెల్లడించారు. మండలంలోని వడ్లకొండలో ఉపాధి హామీ అధికారులు, గ్రామ కార్యదర్శులతో సోమవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించి, అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంపత్‌కుమార్, ఏపీవో భిక్షపతి, గ్రామ కార్యదర్శులు మనోహర్, శ్యామల, మహేందర్, మధు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పోరాటం..



మహాసభలో ప్రసంగిస్తున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి

జనగామ టౌన్, న్యూస్‌టుడే: దేశంలో మతోన్మాద విధానాలతో పాలన చేస్తున్న భాజపాకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి అన్నారు. సోమవారం నుంచి ప్రారంభమైన ఐద్వా జిల్లా మహాసభలు తొలుత జనగామ పట్టణంలోని ఓ వేడుకల మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య జెండావిష్కరణ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో అరుణజ్యోతి మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో మహిళల హక్కుల కోసం ఐద్వా పోరాడుతోందన్నారు. భాజపా పాలనలో గత పదేళ్లుగా హక్కులను హరిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి షబానా, ప్రతినిధులు కల్యాణి, మోకు భవాని, శ్రీలత, సౌందర్య, మమత, రజిత, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రాను విస్తరించాలి: కొమ్మూరి

జనగామ, న్యూస్‌టుడే: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చేందుకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళన, జలవనరుల ఆక్రమణల నివారణకు చేపడుతున్న కార్యక్రమంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆక్రమణలను తొలగించేందుకు హైడ్రా ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యలను అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారని, దానిని హైదరాబాద్‌తో పాటు, జిల్లాలకు, మారుమూల ప్రాంతాలకు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. జనగామలోనూ హైడ్రా మాదిరి సంస్థను ఏర్పాటు చేసి కబ్జాలను నివారించాలని ప్రభుత్వాన్ని కోరారు.

మాటలు కలిపారు.. ఆభరణాలు కొట్టేశారు..!

జనగామ టౌన్, న్యూస్‌టుడే: బస్సులో ఎక్కిన ఇద్దరు గుర్తు తెలియని మహిళలు ఓ వృద్ధురాలితో మాటలు కలిపి చాకచక్యంగా ఆమె బ్యాగులో ఉన్న బంగారు నగలను చోరీ చేసిన సంఘటన జనగామ పట్టణంలో వెలుగుచూసింది. పట్టణ సీఐ దామోదర్‌రెడ్డి కథనం ప్రకారం.. జనగామ పట్టణం గణేష్ వాడకు చెందిన చొల్లేటి నివేదిత(60) అనే మహిళ శనివారం హనుమకొండ నుంచి జనగామకు సాయంత్రం సమయంలో బస్సులో వస్తుండగా, ఇద్దరు గుర్తు తెలియని మహిళలు కూడా బస్సు ఎక్కారు. ఒకరు నివేదిత పక్కకు కూర్చోగా మరొకరు నిలబడ్డారు. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో జనగామకు చేరుకున్న సందర్భంలో దిగిన నివేదిత ఇంటికి వచ్చాక బ్యాగులో ఉన్న 35 తులాల బంగారు నగలు కనిపించలేదు. దీంతో తన పక్కనే ఉన్న మహిళలే అపహరించుకుపోయారని గ్రహించి, ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. బస్టాండ్‌లో సీసీ కెమెరాలు పరిశీలించగా బస్సు దిగిన మహిళల కోసం మరో కారు రావడంతో అందులో వెళ్లిపోయినట్లుగా పోలీసులు గుర్తించారు. ఎస్సై భరత్ ఆధ్వర్యంలో క్రైం పోలీసులు సదరు నిందితురాళ్ల కోసం గాలిస్తున్నట్లు తెలిసింది.


విద్యుత్తు శాఖలో బదిలీలు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జిల్లా విద్యుత్ శాఖలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్లలో పలు స్థాయిల్లో అధికారులు, ఉద్యోగుల బదిలీలకు సోమవారం జాబితా సిద్ధమైంది. వారికి నేడే, రేపో బదిలీ ఉత్తర్వులు ఇవ్వనున్నారు. ఎస్‌ఈ వేణుమాధవ్ ఆధ్వర్యంలో జాబితా సిద్ధం చేశారు. జిల్లాలో ఏడీఈలు -03, ఏఈలు-14, సబ్ ఇంజినీర్లు-13, సీనియర్ లైన్ ఇన్స్‌పెక్టర్లు-05, ఫోర్‌మెన్లు-03, రికార్డు అసిస్టెంట్లు-02, ఆఫీస్ సబార్డినేట్లు-07, జూనియర్ అసిస్టెంట్లు-11, జేఏవోలు-11, సీనియర్ అసిస్టెంట్లు-16 మంది బదిలీల జాబితాలో ఉన్నారు. జనగామ డివిజన్‌లో లైన్ ఇన్స్‌పెక్టర్లు-07, లైన్‌మెన్లు-29, జేఎల్‌ఎంలు-01, స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్‌లో లైన్ ఇన్స్‌పెక్టర్లు-07, లైన్‌మెన్లు-16 మంది జాబితాలో ఉన్నారు.

నేడు డీఎస్సీ నియామక అభ్యర్థుల జాబితా

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: నేడు(మంగళవారం) సాయంత్రం 4 గంటల లోపు డీఎస్సీ నియామక అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.రాము సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియామక అభ్యర్థుల జాబితాను www.deojangaon.com వెబ్‌సైటులో సాయంత్రంలోగా పొందుపరచనున్నట్లు పేర్కొన్నారు. జాబితాలోని వారు రేపు(బుధవారం) ఉదయం 8 గంటలకు కలెక్టరేటుకు రావాలని, తప్పనిసరిగా పాస్‌పోర్టు సైజ్ ఫొటో వెంట తెచ్చుకోవాలని సూచించారు.

వరుణుడి భయం.. పచ్చి మీదే వరి కోత..



జనగామ మండలం గానుగుపహాడ్‌లో పచ్చిమీదే కోతలు

జనగామ రూరల్, న్యూస్‌టుడే: వానాకాలం సాగు ఆరంభం నుంచి రైతులకు అడుగడుగునా ఆందోళన, కలవరం తప్పడం లేదు. సకాలంలో వర్షాలు పడకపోవడం, తీరా పంటలు చేతికందే సమయంలో భారీ వానలు, గాలి బీభత్సంతో కర్షకులు నిత్యం సతమతమవుతున్నారు. దీంతో వరిని పచ్చిమీదే కోతలు చేపట్టాల్సిన గత్యంతరం ఏర్పడింది. మరికొన్ని రోజులు వేచి చూస్తే దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతోందని, రక్షించుకునేందుకు తప్పడం లేదని కర్షకులు చెబుతున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇలా..

జిల్లాలో వరి, పత్తి, కంది, మొక్కజొన్న పంటలు ప్రధానంగా సాగవుతున్నాయి. ప్రధాన పంటగా వరి 2.06 లక్షల ఎకరాల్లో సాగైంది. జనగామ జిల్లాలో మే, జూన్ నుంచే సాగు చేయటంతో ప్రస్తుతం కోత దశకు చేరాయి. వర్షం ముంపునకు గురైతే పంట నేల వాలడం, తడిసిన ధాన్యం రంగు మారడం, మొలకలు రావడంతో నాణ్యత దెబ్బతింటుంది. దీనికి తోడు నేలవాలితే యంత్రాల ఖర్చు రెండింతలు కానుంది. చేసేదేమి లేక పలువురు అన్నదాతలు ముందుగానే కోతలు చేపడుతున్నారు. ఆ ప్రభావం మద్దతు ధర లభించే అవకాశం పోతుంది. అలాగే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు చేపట్టకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయించుకోవాల్సిన దుస్థితి ఎదురవుతోందని పలువురు రైతులు వాపోతున్నారు. మరో వారం రోజుల్లో కోతలు ముమ్మరం కానున్నాయి. ప్రభుత్వ మద్దతు ధరకు, ప్రైవేటులో చాలా వ్యత్యాసం ఉంటుందని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో సాగైన వరి: 2.06 లక్షల ఎకరాలు
ప్రస్తుతం కోత పూర్తైంది: 15-20వేల ,,
ప్రభుత్వ మద్దతు ధర: రూ.2300
ప్రైవేటు మద్దతు ధర: రూ.1700-1900

నెట్టింట్లో.. అమ్మేస్తున్నారు!

● అరుదైన జంతువుల అక్రమ రవాణా

ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి

ఉమ్మడి వరంగల్ జిల్లా అడవుల్లో వన్యప్రాణులకు నెలవైన ప్రాంతాలున్నాయి. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో గోదావరి తీరం వెంట దట్టమైన, పచ్చని అడవుల్లో జంతువుల ఆవాసానికి అనుకూలంగా ఉంటుంది. వేటగాళ్లతో వాటికి ముప్పు వాటిల్లుతోంది.. గుట్టుగా వేటాడి వన్యప్రాణుల చర్మాలు, గోళ్లు, మాంసంతో వ్యాపారం చేసుకుంటున్నారు. అధికారులు చర్యలు తీసుకుంటున్నా.. వేట మాత్రం ఆగడం లేదు.. గత శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అరుదైన జంతువులను ఏకంగా ఆన్‌లైన్‌లో విక్రయానికి పెట్టారు. నూతన పంథాలో దుండగులు పాంగోలిన్(అలుగు)ను అక్రమ రవాణా చేసేందుకు సిద్ధమయ్యారు.

చెన్నై బ్యూరో సభ్యులు మాటేసి..

ఇక్కడ ఇంత తతంగం జరుగుతున్నా.. స్థానిక అధికారులు ఈ విషయాన్ని పసిగట్టలేదు. వాట్సాప్ గ్రూపును చెన్నై కేంద్రంగా నడిచే వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బోర్డు గుర్తించింది. ఆ వాట్సాప్ గ్రూప్‌లో బ్యూరో సభ్యులు కొనుగోలుదారులుగా సంప్రదింపులు చేశారు. ఇద్దరు సభ్యులు ఆ నెంబర్ల ఆధారంగా చాట్ చేసుకుంటూ వరంగల్ చేరుకున్నారు. దుండగులు చెప్పినట్లుగా భూపాలపల్లి, కాటారం ప్రాంతాలకు వచ్చారు. మాటు వేసి అలుగును, ముగ్గురు నిందితులను పట్టుకున్నారు.

వాట్సాప్ గ్రూపు ఏర్పాటు..

పాంగోలిన్ లాంటి అరుదైన వన్యప్రాణుల విక్రయాలకు దేశవ్యాప్తంగా పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు సమాచారం. పురాతన వస్తువుల పేరిట దేశవ్యాప్త నెట్‌వర్క్‌తో ఓ వాట్సాప్ గ్రూపు నడుపుతున్నారు. ఇందులో భూపాలపల్లి జిల్లాకు చెందిన కొందరు ఉన్నట్లు తెలిసింది. వారే అలుగు ఫొటోలను అప్‌లోడ్ చేసి అమ్మకానికి పెట్టారు.. ఇలాంటి నెట్‌వర్క్‌తో ఇక్కడి వారికి సంబంధాలు ఉండటం విస్తుగొల్పుతోంది. ఎన్నేళ్లుగా ఈ అక్రమ వ్యాపారం జరుగుతుందో తెలుసుకునే పనిలో అటవీ అధికారులు, పోలీసులు ఉన్నారు.

మరో 8 మంది గుర్తింపు..

అలుగు విక్రయంలో ముందుగా ముగ్గురిని పట్టుకున్నారు. అయితే దీని వెనుక తతంగం నడుపుతున్న 8 మందిని గుర్తించారు. కాటారం, భూపాలపల్లి, మహాముత్తారం మండలాలకు చెందిన వివిధ రంగాలకు చెందిన వారుండటం గమనార్హం. అందులో ఓ రాజకీయ నేత కూడా ఉన్నాడు. ఐదుగురిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వారిని పట్టుకుంటే ఈ దందా పూర్తిస్థాయిలో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు చెందినవారు ఉండే అవకాశం ఉందని ఓ అధికారి చెప్పారు.

అరుదైన జంతు విక్రయాల ముఠాలు..

అంతరించిపోతున్న జంతువును వేటాడేందుకు ముఠాలు తిరుగుతుంటాయి. అలుగు, పులి, చిరుత, వాటి చర్మం, నక్షత్ర తాబేలు, రెండు తలల పాము, ఏనుగు దంతాలకు భారీగా డిమాండ్ ఉంటుందనే అపోహతో వీటికోసం వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. అలుగును ఒకరు రూ.30 వేలకు కొన్నట్లు సమాచారం. వాటి పొలుసులకు డిమాండ్ ఉంటుందనేది ప్రచారంలో ఉంది. ఇది చేతులు మారుతూ రూ.3 లక్షల ధర పలికినట్లు తెలిసింది. అరుదైన జంతువులకు ధరలు ఊహించుకుని వాటిని గుట్టుగా వేటాడుతూ దందా నడుపుతున్నారు.

పర్యవేక్షణ అంతంతే..

రాత్రిళ్లే ఎక్కువగా వేట సాగుతోంది. రాత్రిళ్లు అటవీ అధికారుల పర్యవేక్షణ ఉండటం లేదనే ఆరోపణలున్నాయి. వేటగాళ్లు ఆయుధాలతో ఉంటారు. ఇది అధికారులకు సమస్యగా మారింది. వారికి కూడా రక్షణ కరవైంది. తగిన చర్యలు తీసుకుని ఇప్పటికైనా వేటను అరికట్టాల్సిన అవసరం ఉంది.

ఉచ్చులు.. విద్యుదాఘాతం

జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్ తదితర జిల్లాల్లో దట్టమైన అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులున్నాయి. పులులు, చిరుతలు, జింకలు, దుప్పులు, కొండగొర్రెలు, కుందేళ్లు, అడవి దున్నలు, అడవి పందులు, తదితర జంతువులున్నాయి. రాత్రి వేళల్లో గుట్టుగా విద్యుదాఘాతం, ఉచ్చులతో వేటాడుతున్నారు. విద్యుదాఘతంతో మనుషులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం తాడ్వాయి అడవుల్లో పులిని కూడా వేటాడి చంపారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న అలుగు

వేటను అరికడుతున్నాం..

-వసంత, డీఎఫ్‌వో, జయశంకర్ భూపాలపల్లి

వన్యప్రాణుల వేటను అరికడుతున్నాం. వేటతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. వన్యప్రాణుల చట్టాలు, శిక్షలపై వివరిస్తున్నాం. రాత్రి పూట గస్తీ బృందాలను ఏర్పాటు చేశాం. ప్రజలు కూడా సహకరించాలి. వన్యప్రాణుల వేటపై సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం.

హాని తలపెడితే శిక్ష తప్పదు..

- వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం కఠిన శిక్షలు ఉన్నాయి. పులిని ఆటపట్టించినా.. భయపెట్టినా ఆరు నెలలు శిక్ష పడుతుంది.
- పులి, అలుగు, ఇతర షెడ్యూల్-1లో పరిధిలోని ప్రాణులను వేటాడితే నాన్‌బెయిలబుల్ కేసు నమోదవుతుంది. 3 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా పడుతుంది.
- రెండోసారి కూడా అదే తప్పుచేస్తే రూ.25 వేల జరిమానా 3 నుంచి 7 సంవత్సరాల జైలు శిక్ష.
- పులి ఉండే అభయారణ్యంలోని కోర్ ఏరియాల్లో వేటాడితే 3 నుంచి ఏడేళ్ల జైలుశిక్ష పడుతుంది. రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు జరిమానా ఉంటుంది.
- రెండు అంతకంటే ఎక్కువసార్లు వేటాడితే రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు జరిమానా, ఏడేళ్ల జైలు శిక్ష పడుతుంది.
- పులిని వేటాడినట్లు సరైన ఆధారాలుంటే నిందితులను వారెంట్ లేకుండానే అరెస్టు చేయవచ్చు..

లలితా మహా త్రిపురసుందరి దేవిగా భద్రకాళి





పల్లకీలో అమ్మవారి ఉత్సవమూర్తి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అయిదోరోజు సోమవారం శ్రీభద్రకాళి అమ్మవారు లలితా మహా త్రిపురసుందరి(రాజరాజేశ్వరి)గా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి పల్లకీ సేవ, సాయంత్రం శేష వాహన సేవ జరిపారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు లలితా మహాయాగంలో పాల్గొన్నారు. 'కుడా' ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. -రంగంపేట, న్యూస్‌టుడే

'బోధనా రుసుం విడుదలైతేనే కళాశాలలు తెరుస్తాం'



రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమన్యాల సంఘ బాధ్యులు

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు దసరా తరువాత నిరవధికంగా మూసివేస్తున్నట్లు కాకతీయ విశ్వవిద్యాలయ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల సంఘ బాధ్యులు సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. మూడేళ్ల నుంచి యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల జాప్యం కారణంగా, పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉపకార వేతనాల విడుదలలో ఆలస్యం కారణంగా అధ్యాపకులకు, సిబ్బందికి వేతనాలు చెల్లించలేకపోతున్నామన్నారు. పది నెలలుగా ముఖ్యమంత్రికి, వివిధ శాఖల మంత్రులకు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా, నేటివరకు ఎలాంటి పరిష్కార నిర్ణయం వెలువడలేదన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పి.ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధన

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఈ నెల ఒకటి నాటికి రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించినట్లు వరంగల్ డీసీసీబీ, రాష్ట్ర కో ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. రాష్ట్రంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులకు దీటుగా వరంగల్ డీసీసీబీ ఉత్తమ ఆర్థిక కార్యకలాపాలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. సోమవారం హనుమకొండలోని బ్యాంకు కార్యాలయంలో రవీందర్‌రావు అధ్యక్షతన బ్యాంకు మేనేజర్లు, సీఈవో, అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. తొలుత బ్యాంకు రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించినందుకు ఆయన కేకు కోసి బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్‌కు తినిపించారు. అనంతరం జరిగిన సమావేశంలో రవీందర్‌రావు మాట్లాడుతూ తాను ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సమయంలో రూ.12 వందల కోట్లు మాత్రమే టర్నోవర్ ఉందన్నారు. ఈ ఘనత సాధనలో తోడ్పడిన సహకార సంఘాల అధ్యక్షులు, బ్యాంకు మేనేజర్లు, ఉద్యోగులు, సీఈవోలు, ఖాతాదారులకు ధన్యవాదాలు తెలిపారు. రుణమాఫీ పొందిన బ్యాంకు పరిధిలోని రైతులందరికీ వెంటనే కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని మేనేజర్లకు సూచించారు. రుణమాఫీకి అర్హతగల రైతుల వివరాలను ప్రభుత్వానికి సమర్పించడంలో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై జిల్లా సహకార శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఇంకా డీసీసీబీ జీఎం ఉష, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, స్రవంతి, కృష్ణమోహన్, రాజునాయక్, ఉమ్మడి జిల్లాలోని బ్యాంకుల మేనేజర్లు, సీఈవోలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



లాంగ్ జంప్



అండర్-20 బాలికల 800 మీటర్ల పరుగులో విజేతలు



60 మీటర్ల పరుగు పందెం..

-న్యూస్‌టుడే, వరంగల్ క్రీడావిభాగం

తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజులపాటు జరిగే పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అథ్లెట్లు హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేషీ, స్పోర్ట్స్ ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొదట రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లో నిర్వహిస్తే బాగుండు అనుకున్నా.. కానీ! ఇక్కడి జేఎన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ చూసిన తర్వాత సంతోషం కలిగిందన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఛైర్మన్ వరద రాజేశ్వరరావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దీటుగా ఓరుగల్లులో క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. జేఎన్ స్టేడియంలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. గత నెలలో చెన్నైలో జరిగిన సౌత్ ఏషియన్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్(ఎస్ఏఏఎఫ్) గేమ్స్‌లో వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన వినోద్‌కుమార్ 800 మీటర్ల పరుగులో కాంస్యం, గచ్చిబౌళి అకాడమీకి చెందిన మోహిత్‌చౌదరి 3000 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సాధించారు. వారిని రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో సత్కరించి నగదు బహూకరించారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన అథ్లెట్లకు అతిథులు వ్యక్తిగత మెడల్స్ అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి, నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు శ్రీమాన్, నాగరాజు, పీడీలు సాంబమూర్తి, మహేందర్, కృష్ణ, రజినీకాంత్, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైళ్ల పునరుద్ధరణ

కాజీపేట, న్యూస్‌టుడే : పక్షం రోజులుగా రద్దయిన రైళ్లు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వరంగల్- హసన్‌పర్తి రోడ్ మధ్య నాలుగో లైను పనుల కారణంగా సెప్టెంబరు 22 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు కాజీపేట- బల్లార్షా, వరంగల్- బల్లార్షా మార్గంలో నడిచే దాదాపు అన్ని రైళ్లను రద్దు చేశారు. కొన్ని రైళ్లను దారి మళ్లించారు. దూర ప్రాంత రైళ్లను మాత్రం నడిపించారు. రద్దయిన కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, రామగిరి, ఇంటర్‌సిటీ, సింగరేణిలు 8వ తేదీన, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ 9వ తేదీ నుంచి ప్రారంభమౌతాయి. పండగ వేళ రద్దు కావడంలో ప్రయాణికులు ఇప్పటికే ఇతర మార్గాల ద్వారా ప్రయాణాలు చేశారు. నేటి నుంచి పునఃప్రారంభం అవుతుండటంతో ఇప్పటికే చాలా మంది రిజర్వేషన్లు చేసుకున్నారు. కాగజ్‌నగర్, ఇంటర్‌సిటీలో వెయిటింగ్ లిస్టు ఎక్కువగా ఉంది.

దోపిడీ దొంగలకు ఏడేళ్ల జైలు శిక్ష

వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: పట్టపగలు ఇంట్లో చొరబడి.. విలువైన బంగారు ఆభరణాలు, డబ్బు దోచుకెళ్లిన నలుగురు దోపిడీ దొంగలకు ఏడేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ.. హనుమకొండ జిల్లా ప్రధాన సహాయ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి క్షమాదేశ్‌పాండే సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కేసు వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ నగరంలోని గణేశ్‌నగర్‌కు చెందిన అలవాల సమ్మయ్య 2014 సెప్టెంబరు 26న మధ్యాహ్నం బయటకు వెళ్లారు. అదే సమయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా గోదావరిఖనికి చెందిన షేక్ అలీ హైదర్, కుమారస్వామి, శంకర్, మధుకర్, కోరుట్లకు చెందిన శివకృష్ణ, మహ్మద్ అసీఫ్ ఒక ముఠాగా ఏర్పడి.. హనుమకొండలోని గణేశ్‌నగర్‌కు వచ్చారు. అలవాల సమ్మయ్య భార్య ఒంటరిగా ఇంట్లో ఉండటాన్ని గమనించారు. బయట ఒకరు కాపలా ఉండి.. మిగతావారు ఇంట్లో చొరబడి ఆమెను బంధించారు. విలువైన వస్తువులు మూటగడుతుండగా.. అదే సమయంలో బయటకు వెళ్లిన సమ్మయ్య ఇంటికి వచ్చారు. బయట ఉన్న వ్యక్తిని ఎవరు నువ్వు అని ప్రశ్నించగా.. అతడు సమ్మయ్యను బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి బంధించాడు. అనంతరం ఆభరణాలు, నగదు, చరవాణులతో ఉడాయించారు. బాధితుడు సమ్మయ్య ఫిర్యాదు మేరకు హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అనంతరం న్యాయస్థానంలో నేరారోపణ పత్రాన్ని దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో కోర్టు పైవిధంగా శిక్ష విధించింది. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ వాదించారు. విచారణ సందర్భంగా కోర్టు కానిస్టేబుల్ సుభాష్ సాక్ష్యులను ప్రవేశపెట్టారు.

నేటి నుంచి రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన

గోపాలపూర్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర చేనేత, జౌళి శాఖల ఆధ్వర్యంలో హనుమకొండలోని ఎన్జీవోస్ కాలనీ రోడ్‌లోని రెడ్డి మ్యారేజ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నుంచి ఈ నెల 21 వరకు రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వరంగల్ చేనేత, జౌళి శాఖ ఏడీ రాఘవరావు తెలిపారు. ప్రదర్శనలో నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరలకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో పాల్గొనే చేనేత సహకార సంఘాలు, సంస్థలు ఎలాంటి రుసుం లేకుండా అమ్మకాలు జరుపుకోవచ్చన్నారు. ప్రదర్శనలో పోచంపల్లి, వెంకటగిరి, మంగళగిరి, ఉప్పాడ, చీరాల చీరలు, డ్రెస్ మెటీరియల్స్, కరీంనగర్ బెడ్ షీట్లు, లుంగీలు, టవళ్లు, పత్రంజిలు, కార్పెట్లు తదితరాలు విక్రయిస్తారని తెలిపారు. పలు రాష్ట్రాల నుంచి 60 ప్రాథమిక చేనేత సహకార సంఘాలు పాల్గొంటున్నట్లు రాఘవరావు తెలిపారు.

రసం పీల్చే.. పురుగుల పనిపడదాం..!



ఉమ్మడి వరంగల్ జిల్లాలో పత్తి ప్రధాన వాణిజ్యపంటగా ఉంది. పూత, కాతగా దశలో ఉండగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పత్తిలో ప్రధానంగా రసం పీల్చే పురుగులు ఉధృతి పెరుగుతున్న పరిస్థితిని గమనించామని మల్యాల కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మాలతి, పంట ఉత్పత్తి విభాగ శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్ తెలిపారు. సస్యరక్షణ చర్యలను 'రైతేరాజు'కు వివరించారు.

-న్యూస్‌టుడే, మానుకోట

పేనుబంక : లేత కొమ్మలు, ఆకుల అడుగు భాగాల నుంచి తల్లి, పిల్ల పురుగులు రసం పీల్చుతాయి. ఆకులు దోనెలుగా మారడం, తేనె వంటి జిగురు పదార్థం విసర్జించడం వల్ల ఆకులపై నల్లని బూజు ఏర్పడుతుంది. నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఇమిడాక్లొప్రిడ్ 0.25 మి.లీ లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తామరపురుగు : తల్లిపిల్ల పురుగులు సన్నగా పసుపు రంగులో ఉండి రసం పీల్చుతాయి. ఆకులు పెలుసుగా మారుతాయి. నివారణకు.. మోనోక్రొటోఫాస్ 1.6 మి.లీ లేదా ఎసిఫేట్ 75 ఎస్‌పీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లీటర్ నీటికి లేదా డైఫెన్ థయురాన్ 1.25 గ్రాములు లేదా స్పెనీటోరం 0.9 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పిండినల్లి : చిన్న పురుగులు లేత పసుపు రంగులో ఉంటాయి. తల్లిపురుగులు రెక్కలు లేకుండా మైనపు పూత గల వెంట్రుకలతో కప్పబడి ఉంటాయి. ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణకు ప్రొపెనొఫాస్ 50 ఈసీ లేదా మిథైల్‌పారాథియాన్ 50 ఈసీ ఎసిఫేట్ 2 గ్రాములు+ట్రైటాన్ లేదా సాండొవిట్ లాంటి జిగురు మందులు ఒక మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పచ్చదోమ : ఆకుల అడుగుభాగాన పిల్ల, తల్లి పురుగులు చేరి రసం పీల్చడం ద్వారా ఆకుల ఈనెలు దోనెలుగా ముడుచుకుని పసుపు రంగులో మారుతాయి. నివారణకు.. ఇమిడాక్లొప్రిడ్ లేదా ఫ్లొనికామైడ్ లేదా ఫిప్రొనిల్ లీటరు నీటికి రెండు మి.లీ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఎసిఫేట్ 75 ఎస్‌పీ ఒకటిన్నర గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తెల్లదోమ : పిందె, కాయ దశలో ఆశిస్తుంది. పురుగు సోకిన మొక్కలు గిడసబారి పూమొగ్గలు, కాయలు రాలిపోతాయి. నివారణకు డైఫెన్‌థయురాన్ 1.25 గ్రాములు లేదా స్పైరొమెసిసిన్ ఒక మి.లీ లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రాములు లేదా సల్ఫాక్సాఫ్లోర్ 0.76 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు



మిరపనారు

కొంటున్నారా.. జాగ్రత్త సుమా!

మానుకోట, న్యూస్‌టుడే : మిరపనారు కొనుగోలులో రైతులు జాగ్రత్త వహించాలని మహబూబాబాద్ జిల్లా ఉద్యానశాఖ అధికారి జినుగు మరియన్న, వ్యవసాయాధికారిణి ఎం.విజయనిర్మల తెలిపారు. ధ్రువీకరించిన నర్సరీల నుంచి మాత్రమే మిరప నారును కొనుగోలు చేయాలి. ఇతర రాష్ట్రాలు, జిల్లాలు, ప్రాంతాల నుంచి వచ్చే మిరపనారు కొనుగోలును ఎలాంటి ధ్రువీకరణ, బిల్లులు లేకుండా కొనుగోలు చేయవద్దు. పేరొందిన కంపెనీలు, రకాల నారును వ్యవసాయ, ఉద్యాన శాఖలచే ధ్రువీకరించిన నర్సరీల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. ఈ విషయంలో సందేహాలు ఉంటే రైతులు ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులను సంప్రదించాలని చెప్పారు.

ప్రశ్న- సమాధానం

? యాసంగిలో కంది, పెసర సాగు చేసేందుకు అనువైన రకాలు, అవసరమైన విత్తనం.. ఎప్పటివరకు సాగు చేసుకోవచ్చో తెలపండి..? – మారపల్లి రామచంద్రారెడ్డి, హసన్‌పర్తి.



✔ యాసంగిలో పెసరను అక్టోబర్ చివరి వరకు విత్తుకోవచ్చు. పెసరలో ఎంజీజీ 295, ఎంజీజీ 397(మధిర), ఎంజీజీ 378(భద్రాద్రి), ఎంజీజీ 351(శ్రీరామ), డబ్ల్యూజీజీ 37 (ఏకశిల), డబ్ల్యూజీజీ 72(యాదాద్రి) రకాలు అనువైనవి. ఎకరాకు 6-8 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. కందిని అక్టోబర్ 15 వరకు ఏక పంటగా, వేరుసెనగతో మిశ్రమంగా సాగుచేసుకోవచ్చు. కందిలో డబ్ల్యూఆర్‌జీ 53, టీడీఆర్‌జీ 4, ఆర్‌జీటీ1, పీఆర్‌జీ 158, ఎంఆర్‌జీ 41, పీఆర్‌జీ 158 ఎంజీఆర్‌జీ 1004 రకాలు అనువైనవి. ఎకరాకు 6-8 కిలోల విత్తనం అవసరం. విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి.

-కె.దామోదర్‌రెడ్డి, ఏడీఏ, నర్సంపేట

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే





రైతు రవీందర్

సర్వి చెట్లు.. ఆదాయానికి మెట్లు

న్యూస్‌టుడే, రేగొండ(భూపాలపల్లి జిల్లా) : తక్కువ పెట్టుబడితో సర్వి మొక్కల పెంపకం చేపడితే మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం భాగిర్థిపేట గ్రామానికి చెందిన రైతు రవీందర్.. ఎకరానికి మూడేళ్లకు సుమారు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని 'రైతేరాజు'కు వివరించారు. 'భాగిర్థిపేటలో రెండెకరాలు, కొత్తపల్లిలో మరో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. కొత్తపల్లి గ్రామంలోని వ్యవసాయ భూమిలో రెండేళ్ల కిందట ఆయిల్‌పామ్ సాగు చేశాను. ఓ మిత్రుడి సూచనతో అంతర్గత పంటగా సర్వి మొక్కల పెంపకం చేపట్టాను. సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్లు నుంచి రూ.2.40 పైసలకో మొక్క చొప్పున సుమారు 3600 మొక్కలు కొనుగోలు చేశాను. ఐదుగురు కూలీల సాయంతో రెండెకరాల్లో 19 నెలల కింద మొక్కలను నాటాను. 30 నుంచి 36 నెలలకు మొక్కలు కటింగ్ దశకు చేరుతాయి. ఒక్కో టన్నుకు రూ.5600 నుంచి రూ.6600 వరకు ధర ఉంటుందని కంపెనీ వారు చెప్పారు. ఎకరానికి సుమారు 60 నుంచి 70 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. రెండెకరాల్లో సుమారు 120 నుంచి 140 టన్నుల వరకు కలప వస్తే, టన్నుకు రూ.5600 ధర ఉన్నా ఆదాయం రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు వచ్చే అవకాశం ఉందని రైతు ఆశాభావం వ్యక్తం చేశారు. కంపెనీ(పేపర్ మిల్లు) వారే కొనుగోలు చేస్తామని చెప్పడంతో ఎలాంటి మార్కెటింగ్ ఇబ్బందులు లేవు. మొక్కలు, కూలీల, కలుపు మందులు రూపేణా ఇప్పటివరకు కేవలం రూ.10 వేల మాత్రమే ఖర్చయింది. ఆయిల్‌పామ్ కాత దశకు చేరేసరికి సర్వి మొక్కల పెంపకం పెంపకం అయిపోతుందని' వివరించారు.

అమెరికాలో పూల పండగ

జనగామ, జనగామ టౌన్, న్యూస్‌టుడే: విదేశమేగినా.. మన సంస్కృతి, సంప్రదాయాలను మరువబోమని మహిళలు ప్రతి ఏటా బతుకమ్మ పండగను ఘనంగా నిర్వహించుకుంటున్నామని చెబుతున్నారు.. జనగామకు చెందిన ప్రవాస భారతీయులు రేణు కుంట కల్యాణ్, ప్రతిభ. అమెరికాలోని కొలంబస్ ఇండియానాలో నివసిస్తున్న తాము ఇరుగు పొరుగు వారితో కలిసి ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు వేడుకలు నిర్వహించుకున్నట్లు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. మన పండగలు చూసి అమెరికావాసులు కూడా సంబురపడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు.




అమెరికాలోని కొలంబస్ ఇండియానాలో..



అరచేతిలో ఓటరు జాబితా

ములుగు టౌన్, దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పలువురు తమ ఓటు వేయడానికి వెళ్తే పేరు లేక వెనుదిరిగిన సందర్భాలున్నాయి. ఈ క్రమంలో పౌరులందరూ తమ హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం పలు చర్యలు తీసుకుంటుంది. తాజాగా తమ పేరు జాబితాలో ఉందో లేదో సరిచూసుకొనే వెసులుబాటు కల్పించింది. గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శించి పెట్టే ఓటర్ల జాబితాలో పేరు చూసేంత వీలు లేకపోవడంతో తమ చరవాణి, ఇతర గ్రాహకాల్లో చూసుకునేందుకు అంతర్జాల వేదికను అందుబాటులోకి తెచ్చింది.



వివరాలు తెలుసుకోవచ్చు ఇలా..

ఆధునిక హంగులున్న ఫోన్‌లో గూగుల్‌లో అంతర్జాల అనుసంధానం ద్వారా TSEC.gov.in అని ఆంగ్లంలో నమోదు చేస్తే వెబ్‌సైట్ కనిపిస్తుంది. అందులో ఎంట్రీలో రోల్ అనే ఆప్షన్ వద్ద ప్రవేశ మీట నొక్కితే 2024 ఓటర్ల జాబితా పుట ఉంటుంది. అందులో జిల్లా, శాసనసభ నియోజకవర్గం, గ్రామం పేరు మీద క్లిక్ చేయాలి. వెంటనే నాలుగంకెల సంఖ్య వస్తుంది. అది నమోదు చేస్తే జాబితాలో వరుస సంఖ్య సహా సమస్త వివరాలు కనిపిస్తాయి.

● త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రతి ఓటరు ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన సదుపాయాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నకిలీ పోలీసుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ పార్థసారథి, చిత్రంలో నిందితులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: పోలీసులమని చెప్పుతూ డబ్బులు వసూలు చేసిన ఇద్దరు యువకులను జనగామలో పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జనగామ ఏసీపీ పార్థసారథి కేసు వివరాలను వెల్లడించారు. దేవరుప్పుల మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన నిఖిల్ ఈ నెల 5న నిడిగొండలో ఓ వేడుకకు హాజరై ద్విచక్ర వాహనంపై వస్తుండగా, జనగామ మండలం యశ్వంతాపూర్ గ్రామానికి చెందిన కాముని వినయ్, యామంకి మధు అనే ఇద్దరు యువకులు నిత్యం అడ్డగించి తాము క్రైమ్ బ్రాంచ్ పోలీసులమని చెప్పారు. ఆయన వద్ద నుంచి రూ.1900 నగదు తీసుకెళ్లారు. నిఖిల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి, వినయ్, మధును అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఓ ద్విచక్రవాహనం, రెండు చరవాణులు, రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో పట్టణ సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం... మీకు తోడుగా

జనగామ: 80085 74872
జనగామ అర్బన్: 80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

వీధి దీపాలకు మరమ్మతు

స్పందనకు వందనం

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని గౌడకుల వీధిలో పలు స్తంభాలకు వీధి దీపాలు వెలగడం లేదని సోమయ్య అనే వ్యక్తి 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో సోమవారం కథనం ప్రచురితం కాగా.. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరాచారి స్పందించి, సిబ్బందితో దీపాలకు మరమ్మతు చేయించారు.

నర్మెట్ట: మండల కేంద్రంలోని పలు వార్డుల్లో కొన్ని స్తంభాలకు వీధి దీపాలు వెలగడం లేదని కాలనీవాసులు మేమున్నాం.. మీకు తోడుగాకు వివరించారు. సమస్యను న్యూస్‌టుడే పంచాయతీ కార్యదర్శి కె.శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సానుకూలంగా స్పందించి సిబ్బందిని పురమాయించి కాలనీల్లో వీధి దీపాలకు మరమ్మతు చేయించారు.

మురుగు తొలగింపు

తరిగొప్పుల, న్యూస్‌టుడే: మండలంలోని సోలిపురం గ్రామం ఒకటోవార్డు మురుగు కాలువ వ్యర్థాలతో నిండి దుర్గంధం వెదజల్లుతుందని కాలనీవాసులు మేమున్నాం మీకు తోడుగాకు తెలియజేశారు. ఈ విషయాన్ని న్యూస్‌టుడే గ్రామ కార్యదర్శి భూక్య లింగం దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకులంగా స్పందించి సిబ్బందితో శుభ్రం చేయించారు.

పంచాయతీ కార్మికుల ధర్నా



జనగామ అర్బన్, న్యూస్‌టుడే: మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జనగామ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వందలాది మంది గ్రామ పంచాయతీ కార్మికులతో ధర్నా చేపట్టారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ రిజ్వాన్‌బాషా, డీపీవోలకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులను పండగపూట పస్తులు ఉంచొద్దని, తక్షణమే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత కేటగిరిలన్నింటిని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు, కార్మికులు నారోజు రామచంద్రం, బత్తిని వెంకన్న, బసవ రామచంద్రం, మల్లాచారి, మల్లేశ్, జీడి ఆనందం, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో 'పాకాల అలయ్ బలయ్'



బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా కొడకండ్ల మండలం పాకాల గ్రామస్థులు హైదరాబాద్‌లో స్థిరపడిన వారిలో పలువురు సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్ వద్ద ఆత్మీయంగా కలుసుకున్నారు. 'పాకాల అలయ్ బలయ్' పేరిట నిర్వహించిన సమ్మేళనం అనుబంధాలు, భావోద్వేగాన్ని తట్టి లేపింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నిర్వహణ కమిటీ ప్రతినిధులు జిలుకర రవికుమార్, డాక్టర్ బాకి విద్యాకుమార్, యు.సోమయ్య, బొట్టుమంచి సుధాకర్, గోలి ప్రకాశ్, జక్కుల జీవరత్నం, మాదారపు ఎల్లయ్య, రాపోలు నర్సయ్య, తార, సోమశేఖర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు తమ పల్లె పోరాట చరిత్ర, గొప్పతనం, తల్లిదండ్రుల కష్టాల గురించి నెమరేసుకున్నారు. గ్రామాభివృద్ధికి చేయూతనందించేందుకు సన్నద్ధం కావాలని నిర్ణయించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత తప్పనిసరి



పోచన్నపేటలో మాట్లాడుతున్న ఏసీపీ పార్థసారథి

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: సైబర్ మోసాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జనగామ ఏసీపీ పార్థసారథి అన్నారు. సోమవారం మండలంలోని పోచన్నపేటలో కార్డెన్ సెర్చ్ నిర్వహించి, పలు వాహనాలు, బెల్టు షాపులను తనిఖీ చేసి కాటన్ బీర్లు, గుట్కా ప్యాకెట్లు సరైన పత్రాలు లేని 23 ద్విచక్రవాహనాలు పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏసీపి మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, బ్యాంకు అధికారులమంటూ ఫోన్‌లు వస్తే స్పందించకూడదన్నారు. కార్యక్రమంలో సీఐ అబ్బయ్య, ఎస్సైలు హమీద్, నగేశ్, శ్వేత, మధు, రాజన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల నిరసన



జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఇజ్రాయిల్ పాలస్తీనాలపై దాడి చేసి దురాక్రమంగా దేశంలోకి చొరబడి అనేక మందిని చంపిన ఘటనకు ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఇజ్రాయిల్ వైఖరిని నిరసిస్తూ సీపీఎం, సీపీఐ, సీపీఐఎం లిబరేషన్ పార్టీల ఆధ్వర్యంలో సోమవారం జనగామ ఆర్టీసీ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల బాధ్యులు మోకు కనకారెడ్డి, రాజారెడ్డి, గుమ్మడి రాజు మాట్లాడుతూ.. అమెరికా సామ్రాజ్యవాద అండదండలతో ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులు చేస్తోందని ఆరోపించారు. భారత ప్రభుత్వం కూడా పాలస్తీనాకు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జోగు ప్రకాష్, సోమయ్య, రమేష్, బూడిద గోపి, భూక్య చందూనాయక్, లలిత, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



నర్మెట్ట: మచ్చుపహాడ్‌లో..



జనగామలో..



బచ్చన్నపేట: గోపాల్‌నగర్‌లో..

చండీదేవి అలంకరణలో దుర్గామాత



పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో..

దేవీ నవరాత్రోత్సవాలు జిల్లాలో వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారు చండీదేవీ అలంకరణలో దర్శనం ఇచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిపారు. పలు చోట్ల మహాన్నదానాలు నిర్వహించారు. – న్యూస్‌టుడే, బృందం



జనగామ: కుర్మవాడలో..



జఫర్‌గఢ్‌లో..

శీతల శవపేటిక వితరణ

జనగామ టౌన్, జనగామ, న్యూస్‌టుడే: జనగామ పట్టణంతో పాటు పలు గ్రామాల ప్రజలకు మృతదేహాల భద్రతకుగాను ఫ్రీజర్(శీతల శవపేటిక)ను తెదేపా జనగామ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, సామాజిక సేవకుడు రామిని హరీశ్ సోమవారం వితరణగా అందించినట్లు అంబేడ్కర్ సేవా సమితి వ్యవస్థాపకులు మల్లిగారి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కరోనా సమయంలో కూడా దాత హరీశ్ రెండు అంబులెన్స్‌లు, అందించారని పేర్కొన్నారు.

గర్భిణికి పరీక్షలు చేయని ఘటనపై కమిషనర్ ఆరా

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ ఎంసీహెచ్ ఆసుపత్రిలో ఈ నెల 4న గర్భిణికి జనగామ స్థానికత లేదంటూ ఓపీలో చూడని వైద్యుల తీరుపై పలు పత్రికల్లో కథనాలు రావడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆయన జిల్లా వైద్యాధికారి రవీందర్‌గౌడ్‌కు ఘటనపై పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. దీంతో డీఎంహెచ్‌వో సోమవారం ఎంసీహెచ్‌ను సందర్శించి వైద్య సేవలు అందుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులతో ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలందించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కూడలి.. గుంతలమయం..



నెహ్రూపార్కు రైల్వేస్టేషన్ దారిలో..

నిత్యం రద్దీగా ఉండే నెహ్రూపార్కు రైల్వేస్టేషన్ రోడ్డులో పోలీస్ స్టేషన్ పక్కన రజక వీధి నుంచి గణేశ్‌వాడ, బస్టాండుకు వెళ్లే కూడలి వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారింది. పెద్ద పెద్ద గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతను తప్పించేందుకు ఎడమవైపున వెళ్లాల్సిన వారు కుడివైపు వాహనాలను మళ్లించాల్సి వస్తోంది. రూ.లక్షలు వెచ్చించి గుంతలను పూడ్చే పనులు చేపట్టిన పురపాలిక, అక్కడో ఇంత ఇక్కడో ఇంత మొరం పోసి చేతులు దులిపారని ప్రజలు విమర్శిస్తున్నారు. – న్యూస్‌టుడే, జనగామ

సీహెచ్‌సీలో బతుకమ్మ వేడుకలు



బచ్చన్నపేట, న్యూస్‌టుడే: బచ్చన్నపేట సీహెచ్‌సీ ఆసుపత్రిలో వైద్య ఉద్యోగుల ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. వైద్యులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలతో ఆడిపాడారు. కార్యక్రమంలో డాక్టర్లు సృజన, దీప్తి, మానస, అరుణ, యూన్సీరెడ్డి, రమ్య, స్టాఫ్‌నర్సులు, తదితరులు పాల్గొన్నారు.

బస్సు, కారు ఢీ.. ఒకరికి గాయాలు

జనగామ రూరల్, న్యూస్‌టుడే: బస్సు, కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలైన సంఘటన జనగామ మండలం యశ్వంతాపూర్ గ్రామ పరిధి హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపు ఆర్టీసీ బస్సు, కారు వెళ్తున్నాయి. యశ్వంతాపూర్ వద్దకు రాగానే బస్సు మలుపు తిరుగుతుండగా, కారు ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకరికి గాయాలయ్యాయి. పూర్తి వివరాలకు పోలీసులను వివరణ కోరగా.. బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని, విచారణ చేపట్టామని తెలిపారు.

భూ సమస్యలపై ప్రజలకు అవగాహన

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: భూ సమస్యలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సాధిక్ ఫౌండేషన్ ఛైర్మన్ ఎండీ.సాదిక్‌అలీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో గ్రామ భూ సమస్యలు పరిష్కారాల మార్గాలపై సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రాష్ట్రంలో ధరణి స్థానంలో భూమాత చట్టం ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని, భూసమస్యలపై సమగ్ర అధ్యయనం కోసం ప్రజాయాత్ర చేపట్టామని, నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తామని వివరించారు. రైతులు, తదితరులు పాల్గొన్నారు.

డీజే యజమానులను ఆదుకోవాలి

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం డీజేలకు అనుమతులు నిరాకరించడంతో తమకు జీవనోపాధి కరవై బతుకు భారమై ఇబ్బందులు పడుతున్నామని జిల్లాలోని డీజే యజమానులు సోమవారం కలెక్టర్ రిజ్వాన్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు వారు కలెక్టరేట్‌లో నిరసన చేపట్టారు. ప్రభుత్వం డీజేలకు పూర్తిగా అనుమతులు నిరాకరించకుండా షరతులతో కూడిన అనుమతులివ్వాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రమించారు.. చెరువు నింపారు



దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: జనగామ జిల్లాలో ఈ యేడు అనుకున్నంత పెద్ద ఎత్తున వర్షాలు కురవకపోవడంతో మండలంలోని ధర్మాపురం చెరువు పూర్తిస్థాయిలో నిండలేదు. రానున్న కాలంలో వ్యవసాయానికి ఇబ్బందులు ఎదురవుతాయని ఊహించిన ఆయకట్టు రైతులు దేవాదుల కాల్వను తమ సొంత ఖర్చులతో పూడిక పనులు చేయించారు. రెండు రోజులుగా వస్తున్న నీటితో చెరువు పూర్తిస్థాయిలో నిండి సోమవారం మత్తడి పోయడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ కృష్ణమూర్తి, రైతులు గండిపెల్లి యాకయ్య, కన్నెబోయిన దేవరాజు, వెంకన్న, వంగాల యాకయ్య, జాటోతు రాంచంద్రు, రెడ్యా తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం

గీత కార్మికులకు శిక్షణ



స్టేషన్‌ఘన్‌పూర్ న్యూస్‌టుడే: భద్రతతో కూడిన కాటమయ్య రక్షణ కవచంతో ప్రమాదాలను నివారించవచ్చని అబ్కారీశాఖ సీఐ జి.భాస్కర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని తాటి వనంలో సోమవారం గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం వినియోగంపై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామానికి ఇద్దరు వ్యక్తులకు మండల స్థాయిలో శిక్షణ అందించినట్లు వివరించారు. త్వరలోనే కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉప్పలయ్య, మాచర్ల రఘురాములు, కనుకటి రాజయ్య, మూల వైకుంఠం, ఆంజనేయులు, శ్రీనివాస్, శంకరయ్య, లక్ష్మి నారాయణ, రమేష్, మహేందర్ పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖకు పట్టు చీర బహూకరణ



రఘునాథపల్లి, న్యూస్‌టుడే: బతుకమ్మ పండగను పురస్కరించుకుని మంత్రి కొండా సురేఖకు పద్మశాలి సామాజిక వర్గ నాయకులు సోమవారం పట్టు చీరను అందజేశారు. మండలంలోని కంచనపల్లికి చెందిన ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాపోలు రామ్మూర్తి ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో చీర అందించారు. కార్యక్రమంలో నాయకులు రచ్చ కృష్ణమూర్తి, రాపోలు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రఘునాథపల్లి: బాల్ బ్యాడ్మింటన్ అండర్-17 జూనియర్ విభాగంలో మండలంలోని అశ్వరావుపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపారు. ఈ నెల 4, 5, 6 తేదీల్లో కామారెడ్డిలో జరిగిన పోటీల్లో శివరాత్రి అక్షయ, వరికుప్పల మానస, ప్యారాల కావ్యశ్రీ, ముప్పిడి శ్రావణి, భవాని ద్వితీయ స్థానంలో నిలిచారని ప్రధానోపాధ్యాయుడు శోభన్ బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన పీఈటీ రాజేందర్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

మద్యం దుకాణాలపై చర్యలు

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో అనుమతి లేకుండా విచ్చలవిడిగా గొలుసుకట్టు మద్యం దుకాణాలను నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఎం నాయకులు ప్రశ్నించారు. మండలంలోని నిడిగొండలో సోమవారం ఆ పార్టీ గ్రామ సభను నిర్వహించారు. జెండా ఆవిష్కరణలో ఆ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ మాట్లాడుతూ... అనుమతి లేకుండా మద్యం దుకాణాలను నిర్వహిస్తున్నారని, బెల్ట్ దుకాణాల నిర్వాహకుల నుంచి సంబంధిత అధికారులు మామూళ్లు తీసుకుని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వాటిని నిలువరింపచేయాలని లేకపోతే మహిళా సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. గ్రామ నూతన కమిటీ ఎన్నికను నిర్వహించగా కార్యదర్శిగా నామాల యాదగిరి, సహాయ కార్యదర్శిగా కక్కెర్ల రామనర్సయ్య ఎన్నికైనట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సత్తిరెడ్డి, రాజేందర్, బుచ్చయ్య, జ్యోతి కృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలు



జఫర్‌గఢ్: జఫర్‌గఢ్‌కు చెందిన ఆర్యవైశ్య మహిళలు స్థానిక ఆర్యవైశ్య భవనంలో బతుకమ్మలతో ఆడి పాడి సందడి చేశారు. గాంధీ కూడలిలో దుర్గామాత విగ్రహం ఎదుట మహిళలు, యువతులు, చిన్నారులు కోలాటాలు, పాటలతో నృత్యాలు చేశారు.

'రైతు రుణమాఫీలో జాప్యం తగదు'

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతు రుణమాఫీలో జాప్యం చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి అన్నారు. రఘునాథపల్లిలో సోమవారం జరిగిన ఆ పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రుణమాఫీ జాబితాను రూపొందించడంలో ప్రభుత్వం విఫలం కావడంతో అధిక సంఖ్యలో రైతులు లబ్ధి పొందకుండా ఆందోళనకు గురవుతున్నారని ఆయన అవేదన వ్యక్తం చేశారు. గృహ నిర్మాణాలు, రేషన్ కార్డుల జారీలో ఆలస్యం జరుగుతోందని పేర్కొన్నారు. జిల్లాలో చెరువు శిఖం భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించేందుకు సీపీఐ మరో పోరాటానికి సిద్ధం అవుతోందని, అందుకు పార్టీ శ్రేణులు ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కుర్చపల్లికి చెందిన సాధం అశోక్ పార్టీలో చేరగా కండువా కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, మండల కార్యదర్శి కావటి యాదగిరి, ప్రతినిధులు మడికంటి సోమయ్య, రమేశ్, పసుల దాన్యేల్, తూడి రేణుబాబు, చాడ ఎల్లయ్య, గొరిగె సోమయ్య, బాల్నె ఉదయ్ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: మండలంలోని తిడుగు అకేరు వాగు నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై బానోతు రామ్‌చరణ్ తెలిపారు. ఇసుక తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బంది వాగు వద్ద నిఘా ఏర్పాటు చేసి వరంగల్‌కు తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించి డ్రైవర్, యజమానిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: మండలంలోని తమ్మడపల్లి(జి) జడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-04 లో పదో తరగతి (మొదటి బ్యాచ్) విద్యార్థులు పాఠశాలలో అపూర్వ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలుసుకొని సోమవారం సంబరాలు చేసుకున్నారు. అనంతరం గురువులు దేవిసింగ్, శాంతకుమారి, కవిత, నరసింహారెడ్డి, దయాకర్, రాంగోపాల్, శ్రీనివాస్, స్టాలిన్, రవి, నవీన్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.